
తెలుగు టైమ్స్

# అమెరికాలో చదివే విద్యార్థులకు పరిస్థితులపై అవగాహన ముఖ్యం....

**Published On:22-01-2016**



అమెరికాలో తెలుగు కమ్యూనిటీ నాయకునిగా, తానా మాజీ అధ్యక్షునిగా ఎన్నో పదవులను నిర్వహించిన ప్రసాద్ తోటకూర ఇటీవల తెలుగు విద్యార్థులు అమెరికా విమానాశ్రయాల్లో ఎదుర్కొంటున్న చేదు సంఘటనలను దృష్టిలో పెట్టుకుని అమెరికా రాక ముందే విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి 'తెలుగు టైమ్స్' న్యూస్ ఎడిటర్ గోవిందరాజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

## అమెరికాలో యూనివర్సిటీలను ఎలా ఎంచుకోవాలి?

ముందుగా విద్యార్థులు యూనివర్సిటీని, కోర్సును నిర్ణయించుకున్న తరువాత ఆ యూనివర్సిటీ, ఆ కోర్స్‌కు గుర్తింపు ఉందో లేదో నిర్ధారించుకోవాలి. కొన్ని సందర్భాల్లో యూనివర్సిటీకి గుర్తింపు ఉన్నా, ఆ కోర్సుకు గుర్తింపు ఉండకపోవచ్చు. అమెరికాలోని యూనివర్సిటీలు యుఎస్ ఫెడరల్ గవర్నమెంట్ తో కాని లేదా కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ అక్రిడిటేషన్‌ను కాని కలిగి ఉంటుంది. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్

ఎడ్యుకేషన్ గుర్తించిన ఏజెన్సీలు కూడా యూనివర్సిటీల గుర్తింపును నిర్ణయిస్తాయి.

## గుర్తింపు పొందిన యూనివర్సిటీలను తెలుసుకోవడం ఎలా?

అమెరికా డిపార్టుమెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ తమ గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, కోర్సుల సవివర జాబితాను ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ ఉంటుంది. వీటి ద్వారా ఆ యూనివర్సిటీకి, కోర్సులకు గుర్తింపు ఉందో లేదో తెలుసుకోవచ్చు.

## యూనివర్సిటీలలో ప్రవేశాలు ఎలా జరుగుతాయి?

మనం చదువుకునే యూనివర్సిటీని ఎంచుకున్న తరువాత ఖచ్చితంగా అడ్మిషన్ ప్రకియ గురించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలి. ప్రతి యూనివర్సిటీకి అడ్మిషన్ విధానాలు వేర్వేరుగా ఉంటాయి. అకడమిక్ డిగ్రీతోపాటు, టోఫెల్, జిఆర్ఇ, జిమ్యాట్ స్కోర్స్‌ల వివరాలను కూడా కొన్ని యూనివర్సిటీలు అడుగుతుంటాయి. మనం చదివిన డిగ్రీ అమెరికాలో ఏ డిగ్రీతో సమానమో అన్న విషయాన్ని కూడా మనం అమెరికాలోని ఎడ్యుకేషనల్ క్రిడెన్షియల్ వాల్యుయేషన్ ఏజెన్సీలకు పంపి తెలుసుకోవచ్చు. దాని ద్వారా మనం ఏ కోర్సును ఎంచుకోవాలో నిర్ణయించుకోవచ్చు.

## ఆర్థిక ప్రణాళికలను ఏ విధంగా వేసుకోవాలి?

ఓ విద్యార్థి అమెరికాలో చదువుకునే ముందు అమెరికాలో చదువుకు అయ్యే ఖర్చులను ముందుగానే అంచనా వేసుకుని అందుకు తగ్గట్టుగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలి.

అమెరికాలోని కొన్ని ప్రైవేటు సంస్థలు, నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్‌లు అర్హత కలిగిన విద్యార్థులకు కొంతవరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తాయి. కొన్ని యూనివర్సిటీలు కూడా తమ విద్యార్థులకు చేయూతను అందించేందుకు స్వంత ఆర్థిక వనరులను కలిగి ఉంటాయి. మనం ఎంచుకున్న యూనివర్సిటీలలో ఈ సౌకర్యం ఉందో తెలుసుకుంటే మన ఆర్థిక ప్రణాళిక మరింత సులువవుతుంది.

## వ్యయ ప్రణాళిక ఎలా ఉండాలి?

అమెరికాలో విద్యాభ్యాసానికి అయ్యే మొత్తం ఖర్చులు, వసతి, ఆహార ఖర్చుల వివరాలను ముందుగానే తెలుసుకోవాలి. సాధారణ ఖర్చులు కూడా కొన్ని ఉంటాయి. దరఖాస్తు ఫీజు, టెస్ట్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, అమెరికా ప్రయాణపు ఖర్చులు, వసతి, ఆహార ఖర్చులు, యూనివర్సిటీ సెలవు దినాలలో అదనపు ఖర్చులు, దుస్తుల ఖర్చు, వ్యక్తిగత ఖర్చులు, హెల్త్ ఇన్స్యూరెన్స్, ఆటో ఇన్స్యూరెన్స్ (అవసరమైతే) వంటి ఖర్చులను తెలుసుకుని ఓ ప్రణాళికను వేసుకోవాలి.

## స్టూడెంట్ వీసా గురించి తెలపండి?

అమెరికాలో విద్యాభ్యాసం కోసం ఎఫ్ ! స్టూడెంట్ వీసాను అమెరికా అధికారులు జారీ చేస్తారు. అమెరికాలో ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ కింద పాల్గొనాలనుకునేవారికి జె - 1 వీసాను, వృత్తి విద్యాకోర్సులను

అభ్యసించాలనుకునేవాళ్ళకు ఎం-1 వీసాను అమెరికా ప్రభుత్వం జారీ చేస్తుంది.

మనం పంపిన దరఖాస్తును యూనివర్సిటీ అధికారులు పరిశీలించిన తరువాత మనం సెలెక్ట్ అయితే మనకు ఆ యూనివర్సిటీ ఐ20 ఫారంను పంపుతుంది. మీరు ఆ ఫారంలో మీ పేరు, పుట్టిన తేదీ ఇతర వివరాలు, పాస్‌పోర్టులోని సమానంగా ఉన్నాయో లేవో చూసుకోవాలి.

వీసా దరఖాస్తుకోసం I - 901 ఫీజు చెల్లించాలి. ఈ దరఖాస్తును ఆన్‌లైన్‌లో కూడా చెల్లించవచ్చు. ఫీజు చెల్లించి రశీదు పొందిన తరువాత ఎఫ్ 1 స్టూడెంట్ వీసాకోసం యుఎస్ కాన్సులేట్ లేదా యుఎస్ ఎంబసీకి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ సమయంలోనే గుర్తింపు పొందిన యూనివర్సిటీలు తాము విదేశీ విద్యార్థులను చేర్చుకుంటున్నామని I-17 ఫారం ద్వారా ముందుగా యుఎస్ హోమ్‌లాండ్ సెక్యూరిటీకి తెలియజేస్తాయి. అందువల్ల మనం చేరబోయే యూనివర్సిటీ ఈ ఫారంను సమర్పించిందా లేదా అన్న విషయాన్ని మనం ధృవీకరించుకోవాలి.

## వీసా ఇంటర్వ్యూలకు డాక్యుమెంట్లు అవసరమా?

మన పాస్‌పోర్టు గడువు అమెరికాలో మనం నివసించే కాలం కన్నా అదనంగా ఆరునెలల కాలపరిమితిని కలిగి ఉండాలి. నాన్ ఇమ్మిగ్రాంట్ వీసా అప్లికేషన్ ఫారం డిఎస్ - 160 కోసం ఆన్‌లైన్‌లో చూడవచ్చు. వీసా ఇంటర్వ్యూ ఫీజు చెల్లింపు, రశీదును దగ్గర ఉంచుకోవాలి. డిఎస్ - 160 ఫారంను ఆన్‌లైన్‌లో పూరించేటప్పుడే ఫోటోను కూడా జతపరచాలి. సర్టిఫికెట్ ఆఫ్ ఎలిజబిలిటి ఫర్ ఎఫ్-1 స్టూడెంట్‌వీసా, యూనివర్సిటీ మీకు పంపిన ఐ-20 ఫారంను కూడా దగ్గర ఉంచుకోవాలి. వివిధ విద్యాసంస్థల ద్వారా మనం పొందిన డిగ్రీలు, మార్కుల జాబితాలను దగ్గరే ఉంచుకోవాలి. టోఫెల్, జిఆర్ఇ, జిమ్యాట్‌లో వచ్చిన స్కోర్ కార్డుల వివరాలను కూడా ఇంటర్వ్యూ సమయంలో దగ్గరే ఉంచుకోవాలి. ఇంటర్వ్యూ సమయంలో ఉన్నత విద్యాభ్యాసం ముగిసిన తరువాత మనం తప్పనిసరిగా స్వదేశం తిరిగి వెళ్ళాల్సిన అవసరం ఉందని రుజువు చేయాల్సి ఉంటుంది. విద్యాభ్యాసం, వసతి, ప్రయాణపు ఖర్చులకు సరిపడ ఆర్థిక వనరులు మన వద్ద ఉన్నట్లు తెలియజేయాలి.

మనం ఇచ్చిన డాక్యుమెంట్లన్నీ పరిశీలించిన తరువాతనే కాన్సులర్ ఆఫీసర్ మనకు ఎఫ్ 1 వీసా అందజేస్తారు.

## అమెరికా ప్రయాణంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అమెరికాలో ప్రవేశంకోసం చెల్లుబాటు కలిగిన ఎఫ్ - వీసాను ఒకసారి చూసుకోవాలి. పాస్‌పోర్టు అమెరికాలో నివసించే కాలం కన్నా అదనంగా ఆరు నెలలు కాలపరిమితిని కలిగి ఉండాలి. వీసాపై మనం చేరే యూనివర్సిటీ పేరు, వీసా క్లాసిఫికేషన్ సరిగా ఉన్నాయో లేవో చూసుకోవాలి. ఎఫ్ - 1 స్టూడెంట్ వీసాపై మొదటిసారి అమెరికా వచ్చే విద్యార్థులను కోర్సు మొదలయ్యే తేదీ కన్నా 30 రోజుల ముందుగా మాత్రమే దేశలోపలికి అనుమతిస్తారు. ఎఫ్- వీసా పొందిన సమయంలో కాన్సులేట్ అధికారి మనకు అందించిన సీల్ట్

కవర్‌ను అలాగే తెరవకుండా అమెరికా విమానాశ్రయంలో ఉన్న సంబంధిత ఇమ్మిగ్రేషన్ అధికారికి అందించాలి.

## మన దగ్గర ఉంచుకోవాల్సిన డాక్యుమెంట్లు

ఎఫ్ – 1 వీసా పాస్‌పోర్టు (సీల్డ్‌కవర్‌తో సహా)
ఫారం ఐ 20, డిఎస్ – 2019
ఫారం 1–797 ఫీజు చెల్లించిన రశీదు
అమెరికాలో విద్యాభ్యాసానికి, భోజన సదుపాయాలకు ఇతర ఖర్చులకు అవసరమయ్యే ఆర్థిక వనరులు కలిగి ఉన్నట్లు నిరూపించే డాక్యుమెంట్లు
ట్యూషన్ ఫీజు రశీదులు
అవసరమైన విద్యా సంబంధిత పత్రాలు
చేరే యూనివర్సిటీతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిన డే సిగ్నటేడ్ స్కూల్ అఫిషియల్ (డిఎస్ఓ)లేదా సంబంధిత అధికారి వివరాలు,

## అమెరికా వెళ్ళిన తరువాత చేయాల్సిన వివరాలు చెబుతారా?

అమెరికా వెళ్ళిన తరువాత సోషల్ సెక్యూరిటీ నెంబర్ కోసం దరఖాస్తు చేయాలి.
అర్హత ఉంటే డ్రైవింగ్ లైసెన్స్ కూడా తీసుకోవచ్చు.

## విద్యార్థికి ఉపాధి అవకాశాలు ఉంటాయా?

ఎఫ్ – స్టూడెంట్ వీసా కలిగిన విద్యార్థులు ఎవరూ కూడా యూనివర్సిటీ పరిధి దాటి ఉద్యోగం చేయరాదు. యూనివర్సిటీ ప్రాంగణంలోనే ఉద్యోగం చేసే వెసులుబాటు ఉంటే వారానికి 20 గంటలకు మించి ఉద్యోగం చేయరాదు. ఎఫ్ 1 స్టూడెంట్ వీసా విద్యార్థులు అమెరికా దేశంలో తమ కోర్సు పూర్తికాలం, 60 రోజులు అదనంగా మాత్రమే ఉండటానికి అర్హులు. అయితే సైన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం తొలుత 12 నెలలు, తరువాత అదనంగా 17 నెలలు ఉండటానికి అర్హులు.

స్టూడెంట్ వీసా విద్యార్థులు తమకు జారీ చేసిన ఐ 20 ఫారంలోని గడువు ముగిసేలోగా చదువు పూర్తి చేయాల్సి ఉంటుంది.

## ఏర్‌పోర్టులో ఇంటర్వ్యూలు ఎలా ఉంటాయి?

అమెరికా ఏర్‌పోర్టులో దిగిన వెంటనే ఇమ్మిగ్రేషన్ అధికారులు మన అకడమిక్ ప్లాన్స్, ఆర్థిక వనరులకు సంబంధించిన ఇంటర్వ్యూను చేస్తారు. మనం జతపరిచిన డాక్యుమెంట్ల వివరాలకు సరిపోయినట్లుగా, తడబాటు లేకుండా ధైర్యంగా సమాధానం ఇస్తే పెద్దగా పట్టించుకోరు. విద్యాభ్యాసం సమయంలో తాము యూనివర్సిటీ పరిధి దాటి ఉద్యోగం చేయమనే నమ్మకాన్ని వారికి కలిగించాలి.